Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699


# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU


ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue) : 328 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 8 - 5 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## ఇది గర్వించే సమయం... ఆపరేషన్ సిందూర్‌పై మోదీ



**న్యూఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా పాక్‌లోని ఉగ్రస్థావరాలు టార్గెట్‌గా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' తన క్యాబినెట్ సహచరులతో సమావేశమయ్యారు. "ఇది మనమంతా గర్వించదగిన సమయం" అని అభివర్ణించారు. సాయుధ బలగాలు కచ్చితమైన లక్ష్యాలపై దాడులు జరిపారంటూ ప్రశంసించారు. పాకిస్థాన్ లోపలకు చొచ్చుకెళ్లి పంజాబ్ ప్రావిన్స్‌లో 4 చోట్ల, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 5 చోట్లు సాయుధ బలగాలు దాడులు జరిపిన తీరును ఆయన వివరించారు. భారత బలగాలు కచ్చితమైన లక్ష్యాలు ఛేదించడం మనమంతా గర్వించదగని విషయం అని మోదీ చెప్పగానే క్యాబినెట్ సభ్యులు హర్షధ్వానాలు వ్యక్తం చేసారు. ఆపరేషన్ వ్యూహాత్మకంగా ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరక్కుండా కచ్చితంగా అమలు చేశారని, ప్రతీకారదాడులు విజయవంతంగా పూర్తయ్యాయని చెప్పారు. ముందస్తుగానే సమగ్రమైన సన్నాహకాలు చేసుకుని తూచ తప్పకుండా మిషన్ నిర్వహించిందన్నారు. ఆర్మీ ప్రశంసనీయమైన పాత్ర నిర్వహించిందని మోదీ ప్రశంసించారు. యావద్దేశం మనవైపు చూస్తోందని, ఆర్మీ మనకు గర్వకారణంగా నిలిచిందని అన్నారు. ఏప్రిల్ 22న హహల్గాం ఉగ్రదాడి జరిగినప్పటి నుంచి క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని ముందుకు నడిపించిన మోదీ సారథ్యాన్ని మంత్రులంతా ఈ సందర్భంగా ప్రశంసించారు. కాగా, ఆపరేషన్ సింధూర్ నిర్వహించిన తీరు, పరిణామాలపై రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలుసుకున్నారు.

## ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో సిఎం రేవంత్ రెడ్డి అత్యవసర భేటీ

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలువురు ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి ఈ సమీక్ష నిర్వహిస్తారు. సీఎస్, డీజీపీలతో పాటు అందుబాటులో ఉన్న స్థానిక మిలిటరీ అధికారులు, డిజాస్టర్? మేనేజ్మెంట్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం జరపనున్నారు. యుద్ధం నేపథ్యంలో ప్రజలు భయభ్రాంతులకు గురికావద్దని, అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఏవైనా అనుమానాలుంటే వెంటనే పోలీసు విభాగానికి ఫిర్యాదు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. కాగా గత నెల ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ సేనలు ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. భారత సైన్యం పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై నిర్వహించిన కచ్చితమైన దాడులలో సుమారు 90 మంది ఉగ్రవాదులు హతమైనట్లు సమాచారం. భారత సైన్యం, వైమానిక




దళం, నావికా దళం సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో.. కొట్లీ, బహావల్పూర్, ముజఫరాబాద్, మురిద్కే, అహ్మద్‌పూర్ ఈస్ట్ సహా మొత్తం 9 ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నారు. ఈ దాడులు మంగళవారం అర్ధరాత్రి తర్వాత దాడులు జరిపినట్లు రక్షణ శాఖ తెలిపింది. ఈ దాడులు జైషే మహమ్మద్, లష్కరే తోయిబా వంటి ఉగ్రవాద సంస్థలకు చెందిన సీనియర్ నాయకులను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయి.

## దేశ భద్రత, రక్షణ కోసం ప్రతి భారతీయుడు సన్నద్ధంగా ఉండాలి : పురంధేశ్వరి




**విజయవాడ, (రాజధాని వార్తలు):** మన దేశ భద్రత, రక్షణ కోసం ప్రతి భారతీయుడు సన్నద్ధంగా ఉండాలని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ పురంధేశ్వరి పిలుపునిచ్చారు. ప్రస్తుత సమయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి భారతీయలు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని చెప్పారు. మనమంతా ఒక గళంతో మన సైన్యానికి స్ఫూర్తిని ఇవ్వాలని పురంధేశ్వరి పేర్కొన్నారు. ఇవాళ (బుధవారం) విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పురంధేశ్వరితో పాటు బీజేపీ నేతలు పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడారు. పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడికి భారత్ ధీటైన జవాబు ఇవ్వడం ఖాయమని అన్నారు. 26 మంది అమాయకులైన భారత పర్యాటకులను అన్యాయంగా పాకిస్తాన్ ఉగ్రవాదులు చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌కు తప్పకుండా సమాధానం చెబుతామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముందుగానే ప్రకటించారని అన్నారు. పాకిస్తాన్‌లో తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను భారత బలగాలు ధ్వంసం చేశాయని పురంధేశ్వరి అన్నారు. భారతదేశంపై దాడులు ఎలా చేయాలనే దానిపై ఈ స్థావరాల్లో శిక్షణ ఇచ్చారని పురంధేశ్వరి తెలిపారు. అలాంటి శిక్షణ స్థావరాలను ఇండియన్ ఆర్మీ నేలమట్టం చేశారని చెప్పారు. కసబ్ కూడా గతంలో ఇక్కడే శిక్షణ పొందారని తెలిపారు. సయ్యద్ హాఫీజ్ మసీద్‌ను నడుపుతూ ముస్లిం యువకులను ఉగ్రవాదులుగా మార్చారని మండిపడ్డారు. అలాంటి వారిని సమూలంగా నిర్మూలిస్తే ఉగ్రవాదుల దాడులు ఉండవని చెప్పారు. ఈ ఆపరేషన్‌కు సిందూర్ అని మోదీ నామకరణం చేశారని తెలిపారు. మహిళల నుదుట సింధూరం చెరిపేశారు కాబట్టే మిషన్ సిందూర్ అని పేరు పెట్టారని ఉద్ఘాటించారు. ఉగ్రవాదుల చర్యలు ఎదుర్కోనేలా ఇవాళ దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్ జరుగుతుందని తెలిపారు. దాడుల సమయంలో ఎలా స్పందించాలి, ఎలా ఎదుర్కోవాలో ప్రజలకు అధికారులు అవగాహన కల్పిస్తారని పురంధేశ్వరి వెల్లడించారు.

## వంశీకి మళ్లీ నిరాశే.. మరికొన్ని రోజులు

**విజయవాడ, (రాజధాని వార్తలు):** మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. వంశీ రిమాండ్‌ను మరోసారి పొడిగిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చింది. పలు కేసుల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న వంశీ.. ప్రస్తుతం విజయవాడ జిల్లా జైలులో ఉన్నారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వంశీ రిమాండ్ నేటితో ముగిసింది. దీంతో ఈరోజు ఆయనను పోలీసులు జిల్లా జైలు నుంచి తీసుకుని సీఐడీ కోర్టులో హాజరుపరిచారు. వంశీకి ఈనెల 21 వరకు రిమాండ్ పొడిగించింది కోర్టు. ఆ వెంటనే ఆయనను తిరిగి జిల్లా జైలుకు తరలించారు పోలీసులు. నిన్న (మంగళవారం) సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో వంశీకి ఎదురు దెబ్బే తగిలింది. ఈ కేసులో రిమాండ్ ముగియడంతో వంశీని విజయవాడ కోర్టులో హాజరుపర్చగా.. ఈనెల 13 వరకు రిమాండ్‌ను పొడిగించింది న్యాయస్థానం. ఈ కేసులో వంశీతో పాటు వెలినేని శివరామకృష్ణ ప్రసాద్, గంటా వీర్రాజు, నిమ్మ చలపతి,




వేల్పూరు వంశీబాబు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. నిన్న వీరందరి రిమాండ్ ముగియడంతో కోర్టులో హాజరుపర్చగా.. రిమాండ్‌ను పొడిగిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో పరారీలో ఉన్న పలువురిని పట్టుకునేందుకు పోలీసులు యత్నిస్తున్నారు. కాగా.. వంశీని కుటుంబసభ్యులతో గంట పాటు మాట్లాడేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది.

## సినిమా అప్పుడే అయిపోలేదు.. ఆర్మీ మాజీ చీఫ్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా పాక్ ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం విరుచుకుపడి 100 మంది వరకూ ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఏకకాలంలో 9 ఉగ్రవాద స్థావరాలపై దాడులు జరిపింది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో చేపట్టిన ఈ ఆపరేషన్‌పై భారత ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ నరవణే కీలకమైన హింట్ ఇచ్చారు. "సినిమా అప్పుడే అయిపోలేదు.. ఇంకా ఉంది" అంటూ సోషల్ మీడియాలో ఆయన ట్వీట్ చేశారు. దీంతో పాక్ ఉగ్రవాదులపై మరిన్ని చర్యలు భారత ఆర్మీ ప్లానింగ్‌లో ఉన్నాయని, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి పట్టుకునే దిశగా పావులు కదపవచ్చని నెటిజన్లు ఊహాగానాలు చేస్తున్నారు. దీనికి ముందు భారత రక్షణ శాఖ ఒక ప్రకటనలో భారత బలగాలు 'ఆపరేషన్ సింధూర్' నిర్వహించినట్టు ప్రకటించింది. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై దాడులు జరిపి ఎక్కడి నుంచైతే ఉగ్రవాదులు భారత్‌పై కాల్పులకు దిగుతున్నారో ఆ ప్రాంతాలను, అక్కడి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను నేలమట్టం చేసినట్టు తెలిపింది. తొమ్మిది చోట్ల ఈ దాడులు జరిపామని చెప్పింది. ఇవి బలగాలు జరిపిన అతిసహజమైన దాడులని, ఉద్రిక్తతలకు పెంచే చర్యలు కావని, పాక్ మిలటరీ స్థావరాల జోలికి వెళ్లలేదని తెలిపింది. దాడి లక్ష్యాలు, అమలు విషయంలో భారత బలగాలు సంయమనంగా వ్యవహరించినట్టు పేర్కొంది. కాగా, భారత్ దాడుల్లో జైషే మహమ్మద్ చీఫ్, భారత్‌పై పలు దాడుల ప్రధాన సూత్రధారి మౌలానా మసూద్ కుటుంబానికి చెందిన 14 మంది హతమైనట్టు తెలుస్తోంది. భారత్ చేపట్టిన ఆపరేషన్ విజయవంతమైందని, ఇది దేశం గర్వించదగిన సమయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మంత్రివర్గ సహచరులతో జరిగిన సమావేశంలో తెలిపారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకుని జరిగిన పరిణామాలను ప్రధాన వివరించారు.

## ప్రతి భారతీయుడు హర్షించదగ్గ పరిణామం

### - ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**అమరావతి, (రాజధాని వార్తలు):** పహల్గాం దాడితో భారత్ పుట్టెడు దుఃఖంతో మునిగిపోయిందని హిందువు, ముస్లిం అని అడిగి మరీ చంపేసిన విధానం చాలా దారుణమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై స్పందించిన ఆయన బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడిని స్వాగతించినట్లు చెప్పారు. మితిమీరిన సహనంతో చేతులు కట్టేసిన సమస్త భారతానికి... ఆపరేషన్ సిందూర్‌తో తిరిగి వీరత్వాన్ని నింపిందని కొనియాడారు. త్రివిధ దళాధిపతులు, ప్రధాని మోదీకి ఈ సందర్భంగా పవన్ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ఏపీకి చెందిన ఇద్దరు కుటుంబాలతో కశ్మీర్ పర్యటనకు వెళ్లిన వారిని ఉగ్రవాదులు చంపేశారని విచారం వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి బారత్ సేనలు పాకిస్తాన్‌లోని 9 ఉగ్ర స్థావరాలనుధ్వంసం చేయడం గొప్ప విషయమని కొనియాడారు. పాక్‌లో సాధారణ ప్రజలకు ఇబ్బంది కలకకుండా, ప్రాణ నష్టం జరగకుండా.. కేవలం ఉగ్ర స్థావరాలపై దాడి చేసి ధ్వంసం చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు.

**పాకిస్థాన్‌కు ఇది తగిన గుణపాఠం..**




పాకిస్థాన్‌కు ఇది తగిన గుణపాఠమని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ధీటైన జవాబు ఇచ్చామని పవన్ కల్యాణ్ అన్నారు. ఇది ప్రతి భారతీయుడు హర్షించదగ్గ పరిణామమని, సోషల్ మీడియాలో ఏది పడితే అది మాట్లాడకూడదన్నారు. భారత్ దాడిపై ఎవరు వ్యతిరేకంగా మాట్లాడినా చర్యలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరు కేంద్రానికి మద్దతుగా నిలవాలని పిలుపిచ్చారు. కొందరు కాంగ్రెస్ నేతలు భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడారని పవన్ కల్యాణ్ విమర్శించారు.

## ఆయన ఉన్నంతవరకూ.. మన నేలపై గడ్డి మొక్క కూడా పీకలేరు



**మంగళగిరి, (రాజధాని వార్తలు):** పాకిస్థాన్ అండ చూసుకుని చెలరేగిపోతున్న ఉగ్రమూకలను మట్టుబెట్టడమే లక్ష్యంగా భారత సైన్యం తొలి అడుగేసింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా అర్ధరాత్రి వేళ దాయాది దేశంలోని 9 ఉగ్రస్థావరాలపై క్షిపణులతో విరుచుకుపడింది. 'ఆపరేషన్ సిందూర్' పేరిట నిర్వహించిన ఈ దాడులపై ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఉగ్రవాదుల స్థావరాలను నేలమట్టం చేయడాన్ని హర్షిస్తూ ఎక్స్ వేదికగా 54 సెకన్ల వీడియోను ఆయన పోస్ట్ చేశారు.

**100 పాకిస్థాన్‌లకు సమాధానం చెప్పే మిసైల్..**

ఏపీ మంత్రి నారా లోకేష్ 'ఆపరేషన్ సిందూర్'పై స్పందించారు. అమరావతి పునఃప్రారంభోత్సవం సందర్భంగా తన ప్రసంగంలోని కొన్ని మాటలు, నరేంద్ర మోదీ ప్రసంగం, భారత సైన్యం ఉగ్రవాదులపై చేసిన దాడులకు సంబంధించిన దృశ్యాలతో కూడిన 54 సెకన్ల నిడివి గల ఓ వీడియోను ఎక్స్‌లో షేర్ చేశారు. 'మన నేలపై మొలిచిన మొక్క కూడా పీకలేరు! వంద పాకిస్తాన్లకు సమాధానం చెప్పే మిస్సైల్ పేరు మోదీ' అని ట్యాగ్ చేశారు.

## ఆపరేషన్ సిందూర్ ప్రపంచ పటముపై మరోసారి నిలిపింది : అనిత

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** భారత సైన్యం పాకిస్తాన్ భూభాగంలోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడంపై హోం మంత్రి వంగలపూడి అనిత హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం విశాఖలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ భారత దేశ గౌరవాన్ని, సార్వభౌమత్వాన్ని ప్రపంచ పటముపై మరోసారి నిలిపిందని కొనియాడారు. పహల్గామ్ దాడికి భారతదేశం సాహసోపేతంగా తగిన ప్రతీకారం తీర్చుకుందన్నారు. ఉగ్రవాదానికి శాశ్వతంగా ముగింపు వచ్చే వరకు భారతదేశం తన ఆపరేషన్‌లను కొనసాగిస్తుందని ఆమె స్పష్టం చేశారు. పాకిస్తాన్ ఇకనైనా చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయమివ్వడం నిలిపివేయాలని, దేశ రక్షణలో ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చూపుతున్న కట్టుదిట్టమైన విధానం అభినందనీయమని వంగలపూడి అనిత అన్నారు.

**ఏ సమయంలోనైనా యుద్ధం..**

కాగా ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నర్సీపట్నంలో ఆనందోత్సవాలు జరుపుకున్నారు. మహాత్మగాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండాలతో భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. భారత సైన్యానికి జాతీయ జెండాలతో ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఏ సమయంలోనైనా యుద్ధం వచ్చే అవకాశం ఉందన్నారు. శాంతియుత దేశమైన భారతదేశంలో దుశ్చర్యలకు పాల్పడుతున్న వారికి సరైన గుణపాఠం చెప్పాలన్నారు. భారత సైన్యానికి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు.

# స్కీములు మరచి స్కాములు మరిగెను

## - అక్రమ ఒప్పందాలతో ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వం : జమ్మలమడక నాగమణి



**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న స్కీముల సంగతి మరిచి స్కామ్‌ల బాట పట్టిందని వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి విమర్శించారు. స్కీములు ముసుగులో స్కాములు చేస్తూ నాయకులు తమ జేబులు నింపుకుంటున్నారని జగన్ పాలనలో ప్రతి ఒప్పందంలోను పారదర్శకత కనిపిస్తే నేడు చంద్రబాబు ప్రభుత్వంలో పారదర్శకత లోపించి దోపిడీ మోసం కనిపిస్తున్నాయని అన్నారు. ఇసుక మాఫియా, మట్టి మాఫియా, లిక్కర్ మాఫియా, రాజధాని నిర్మాణాల్లో అంచనాలు ఊహించనంత విధంగా పెంచి ప్రజాధనాన్ని దోచుకోవడం చూస్తున్నామని అన్నారు. తాజాగా లంచాలు తీసుకుంటూ అధిక రేట్లకు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకొని ప్రజలకు చంద్రబాబు షాక్ ఇచ్చారని అన్నారు. యాక్సిస్ సంస్థ నుంచి ఏడాదికి 210 కోట్ల యూనిట్లు విద్యుత్ కొనుగోలు చేస్తున్నారని ఇది గత ప్రభుత్వంలో జగన్ చేసుకున్న సెకీ సంస్థతో చేసుకున్న ఒప్పందంతో పోలిస్తే ఒక్కో యూనిట్ మీద 2.10 అదనంగా ఖర్చు చేస్తున్నట్లు లెక్క అని పేర్కొన్నారు. దీనిని బట్టి చూస్తే జగన్ నిజాయితీ రాష్ట్ర ప్రయోజనాల కోసం రాజీలేని మనస్తత్వం కనిపిస్తే తాజా ఒప్పందంలో ప్రజా ఖజానాను దోచేస్తున్న చంద్రబాబు నైజం అర్థమవుతున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ విద్యుత్ అవసరాలకు 30 ఏళ్ల పాటు డోకా లేకుండా రైతులకు పగటి పూటే 9 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్తును అందించేలా కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీతో 7వేల మెగావాట్ల విద్యుత్ ఒప్పందాన్ని యూనిట్ 2.49కే అందించేలా ఒప్పందాన్ని కుదుర్చుకొని లక్ష కోట్లకు పైగా ప్రజాధనాన్ని జగన్ ఆదా చేశారన్నారు. దీనిని కుంభకోణంగా వర్ణించిన కూటమి ప్రభుత్వం నేడు యూనిట్ విద్యుత్‌ను ఏకంగా 4.60 చొప్పున కొనుగోలు చేసి ప్రజలపై భారాన్ని మోపిందని అన్నారు. లంచాల కోసం అవినీతి కోసం బరి తెగించి భారీ ధరకు కొనుగోలు ఒప్పందాలు చేసుకోవడం ద్వారా చరిత్రలోనే అతిపెద్ద స్కాంకు చంద్రబాబు ప్రభుత్వం పాల్పడుతుందని ఆమె విమర్శించారు. యాక్సిస్ ఎనర్జీ వెంచర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో చంద్రబాబు ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం యూనిట్ 4.60 చొప్పున ఉంటే జగన్ ప్రభుత్వం సఖి ఒప్పందంతో పోలిస్తే 2.10 అదనంగా ఖర్చు చేసినట్లు అవుతుందని ఈ భారం అంతా ప్రజల పైనే పడనుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. యూనిట్ విద్యుత్తు రూ.1.9కే వస్తుంటే జగన్ ప్రభుత్వం రూ.2.10 తో ఎందుకు ఒప్పందం చేసుకుంటుందని ప్రచారం చేసిన నాటి ప్రభుత్వ పెద్దలు ఎల్లో మీడియా రూ.4.6కి యూనిట్ కరెంటు కోనుగోలు చేస్తున్న ప్రభుత్వాన్ని ఏమని ప్రశ్నిస్తారని ఆమె సవాల్ విసిరారు. తాను అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను పెంచం ఇంకా తగ్గిస్తాం గత జగన్ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని నాశనం చేసింది ఐదేళ్లలో 1.29 లక్షల కోట్లకు పైగా నష్టం జరిగింది అంటూ ఎన్నికల ముందు ఆ తర్వాత శ్వేత పత్రంలో విమర్శలు చేసిన సీఎం చంద్రబాబు ఇప్పుడు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ఆమె ప్రశ్నించారు. మోసం చేయడంలో చంద్రబాబు దిట్టని రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా మహిళలు ఇప్పటికే గ్రహించారని నాగమణి పేర్కొన్నారు.

# మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి

## - ధాన్యం కొన్న 24 గంటలలోపే రైతు ఖాతాలో ధాన్యం సొమ్ము జమ




**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా గతంలో ఇచ్చిన రెండు లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యానికి అదనంగా మరో లక్ష మెట్రిక్ టన్నులు ధాన్యం రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతిని మంజూరు చేసిందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషాంతి వెల్లడించారు. అమలాపురం కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్లో ఆశించిన ఉత్పత్తులలో 34 శాతం మేర అనగా రెండు లక్షల మెట్రిక్ టన్నుల మాత్ర మే టార్గెట్‌ను ప్రభుత్వం నిర్దేశించారని ఈనెల ఐదో తేదీన కాకినాడలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిర్వహణ తీరు సమీక్షలో రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి వర్యులు నాదెండ్ల మనోహర్‌ను జిల్లా యంత్రాంగం, మిల్లర్లు టార్గెట్ పెంచాలన్న అభ్యర్థన మేరకు అదనంగా లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఆమోదించారని తెలిపారు. ఈ టార్గెట్‌లో 40 వేల మెట్రిక్ టన్నులు బాయిల్ రైసు,60 వేల మెట్రిక్ టన్నులు రా రైస్ సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించారన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఒక లక్ష, 2 వేల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించి 24 గంటలలోపు ధాన్యం సొమ్ములు రైతు ఖాతాకు జమ చేయడం జరుగుతుందన్నారు. మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీలను కూడా 1:2 గా తగ్గించిందన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలు దృష్టిలో పెట్టుకుని రైతులకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం దృష్టి సారించిందని రైతులు కూడా వాతావరణ హెచ్చరికలకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట అకాల వర్షాలకు తడిసిపోయి ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా రైతు సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఏవైనా ఇబ్బందులు సమస్యలు సందేహాలు ఉంటే జిల్లా స్థాయిలో ఉన్న కమాండ కంట్రోల్ రూమ్ నెంబర్లు 83094 32487, 94416 92275 సంప్రదించి నివృత్తి చేసుకొని పరిష్కరించుకోవచ్చును అన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి తేమ శాతం 17 గా ఉంటే కనీస గిట్టుబాటు ధరను చెల్లిస్తారని, 18 శాతం ఉంటే ఒక కేజీ, 19 శాతం ఉంటే 2 కేజీలు, 20% ఉంటే 3 కేజీలు, 21% ఉంటే 4 కేజీలు, 22 శాతం ఉంటే 5 కేజీలు, 22% కన్నా తేమ శాతం ఎక్కువ ఉన్న ఐదు కేజీలు మాత్రమే తరుగులను విధించాలని మిల్లర్లను ఆదేశించామన్నారు. బొండాలు రకానికి బహిరంగ మార్కెట్లో డిమాండ్ ఉందన్నారు. గతంలో దీపం - 1 పథకం కింద ప్రభుత్వం ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేదని ప్రస్తుతం దీపం- 2 క్రింద నాలుగు మాసాలకు ఒక సిలిండర్‌ను ఉచితంగా అందిస్తోందని ఈ విధంగా ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి అందించడం జరుగుతుందన్నారు. దీపం-2 కింద ప్రస్తుతం రెండవ దశ కొనసాగుతుందని రెండో సిలిండర్ పొందేందుకు ఆన్లైన్లో బుక్ చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రి సేవలు, పి జి ఆర్ ఎస్ అర్జీలు పరిష్కార నాణ్యత ఉచిత సిలిండర్ల పంపిణీ వంటి సంక్షేమ పథకాల సంతృప్తి స్థాయిలను ఐ వి ఆర్ ఎస్ పోర్టల్ ద్వారా లబ్ధిదారుల నుండి ప్రభుత్వం కోరుతోందని ఆ దిశగా సంతృప్తి స్థాయిలను మెరుగు పరుస్తూ జిల్లాను సంక్షేమ పథకాల అమలులో ముందంజలో నిలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఏ ఉదయ భాస్కర్, పౌరసర ఫరాల జిల్లా మేనేజర్ కుమారి ఎం బాల సరస్వతి, అసిస్టెంట్ మేనేజర్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో మార్పు తెచ్చేది వేదపండితులు, పురోహితులే

## - హిందూ జనసంఘ సమావేశంలో వక్తలు




**కాకినాడ, (రాజధాని వార్తలు):** సమాజంలో మార్పు తెచ్చేది వేదపండితులు, పురోహితులు, అర్చకులేనని ప్రముఖ పండితులు ఆకెళ్ల మురళీ కృష్ణ అన్నారు. స్థానిక చల్లా ఫంక్షన్ హాల్‌లో హిందూ జనసంఘ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంధ్యావందనం చేయడం ద్వారా సమస్త లోకానికి ఉపకారం కలుగుతుందని అన్నారు. పెద్దలందరిని కలుపుకుని సమాజంలో మార్పు తెచ్చేందుకు ప్రతీ ఒకరూ పాటుపడాలన్నారు. ఢిల్లీలో ముస్లిం మతపెద్దలు ఏది చెబితే ఆ మతంలో అన్నిరకాల ప్రజలు పాటిస్తారని, రోమ్ నగరంలో పోప్ చెప్పిన విషయాన్ని క్రైస్తవులు పాటిస్తారని పేర్కొన్నారు. కానీ మన పీఠాధిపతులు, పెద్దలు చెప్పిన మంచి విషయాలను మాత్రం మనం పాటించడం లేదన్నారు. పెళ్లిళ్లు నిర్వహణలో రామాయణం విశిష్టతను, అయోధ్యలో రామాలయం ఏర్పాటుకు మోడీ చేసిన కృషిని మర్చిపోకుండా అందరూ ప్రచారం చేయాలన్నారు. ఇతర మతస్తులు మన హిందూ జనాభాను తగ్గించే దుష్టప్రయత్నాలు చేస్తున్నారని, వాటిపై అప్రమత్తత అవసమరమని అన్నారు. పట్టణ పురోహిత సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల కొందరు క్రైస్తవులు ఒక పురోహితుని ఇంటికెళ్లి బైబిలు చదవాలని కోరడం జరిగిందని, ఇటువంటి పనులకు పాల్పడుతూ విద్వేషాలు రెచ్చగొడుతున్న వ్యక్తులపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ఇటువంటి సంఘాన్ని ఏర్పాటు చేయాలంటే ధైర్యంతో కూడుకున్నదన్నారు. శ్రీబాలాత్రిపుర సుందరి ఆలయ అర్చకులు నన్నిధి రాజు విజయ కుమార్ మాట్లాడుతూ హిందూ ధర్మపరిరక్షణకు ఏర్పాటు చేసిన ఇటువంటి సంఘాభివృద్ధికి తోడ్పడతామని, సమాజంలో కొందరు పురోహితుల పరిస్థితి దీనంగా ఉందన్నారు. చల్లా ఫంక్షన్ హాల్ అధినేత చల్లా నిరంజన్ మాట్లాడుతూ బ్రాహ్మణ సమాజం ప్రభుత్వం అందించే పథకాలపై ఆధారపడకుండా మనమే వారిని ఆదుకునే దిశగా పాటుపడతామన్నారు. బులుసు అరుణ కుమార్ మాట్లాడుతూ నమాజంలో మనకన్నా గొప్పది సంఘమే అని, మనం ధర్మాన్ని ఆచరిస్తూ పదిమందికి బోధించే శక్తి వేదపండితులకు, పురోహితులకే ఉందన్నారు. ఈ సమావేశంలో దిశ శ్రీనివాస్, కె.భీమశంకరం, సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల పరిశుభ్రతపై అధికారుల ప్రత్యేక దృష్టి





**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలంలోని గ్రామాల్లో పరిశుభ్రతపై అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా సిరిపురం, కొంగోడు గ్రామాల్లో ఇంటింటి చెత్త సేకరణ విధానాన్ని డి.ఎల్.పి.ఓ టీ.అన్నామణి, డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామస్తులకు తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాలని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్లపై, డ్రైనేజీల్లో వేయకుండా ప్రత్యేకంగా భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెత్తను శాస్త్రీయంగా వేరు చేయడం ద్వారా పునర్వినియోగం ద్వారా సంపద సృష్టికి దోహదం చేస్తుందని వివరించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త నుండి సంపద కేంద్రాలను సందర్శించి, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అక్కడ కంపోస్ట్ ఎరువులు తయారు చేసే విధానాన్ని వివరించారు. ఈ ఎరువులు నర్సరీలు, వ్యవసాయ అవసరాలకు ఉపయోగ



పడతాయని తెలియజేశారు. గ్రామాల పరిశుభ్రతకు ప్రజల సహకారం అవసరమని, శుభ్రమైన వాతావరణం ఆరోగ్యకరమైన సమాజానికి దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నున్న సుజాత, ఇంచార్జ్ పంచాయతీ కార్యదర్శి పి వీరభద్రరావు, సర్పంచ్ నక్కా అప్పలస్వామి, కార్యదర్శి జి దుర్గాప్రసాద్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# జాతీయ అథ్లెటిక్స్ పోటీలలో రాష్ట్రానికి గౌరవం తీసుకొచ్చిన యాతం నాగబాబు

## - తృతీయ స్థానాల్లో మూడు కాంస్య పతకాలు - మొత్తం పతకాల సంఖ్య 60కి చేరిక





**కరప, (రాజధాని వార్తలు):** కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌లో జరిగిన 44వ నేషనల్ వెటరన్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఓపెన్ ఛాంపియన్షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన యాతం నాగబాబు 100, 400, 800 మీటర్ల పరుగు పోటీల్లో పాల్గొని మూడు కాంస్య పతకాలను గెలుచుకున్నారు.

దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాల నుంచి పాల్గొన్న క్రీడాకారుల మధ్య జరిగిన ఈ పోటీల్లో ఆయన ప్రతిభా పాటవాలను చాటుతూ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. యాతం నాగబాబు ప్రస్తుతం కరప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కరప సబ్ యూనిట్‌లో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఆయన జాతీయ స్థాయిలో 60 పతకాలను సాధించి రాష్ట్రానికి విశిష్ట గౌరవాన్ని తీసుకొచ్చారు.

ఈ సందర్భంగా మంగళవారం పిహెచ్‌సి కరప, వేళంగి వైద్య సిబ్బంది ఆయనకు ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించి రాష్ట్ర కీర్తిని పతాక శిఖరాలకు తీసుకెళ్లాలని వారు ఆకాంక్షించారు.

# జనసేన సభ్యత్వం కుటుంబాలకు అండ

## - వాలంటీర్ల సత్కారంలో జిల్లా అధ్యక్షులు తుమ్మల



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ప్రతి కుటుంబానికి క్రియాశీలక సభ్యత్వం అండగా ఉంటుంది అని కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. మంగళవారం సాయంత్రం పెద్దాపురం పట్టణం రాజుగారి వీధిలో ఉన్న ఎస్వి కాంప్లెక్స్ వద్ద జనసేన పార్టీ క్రియాశీలక వాలంటీర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిధిగా జనసేన పార్టీ కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి (బాబు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక కుటుంబానికి భరోసా ఇచ్చే విధంగా జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం నమోదు చేయించడం జరిగిందన్నారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్క వ్యక్తికి పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. అలాగే గత 10 సంవత్సరాలుగా పార్టీలో కష్టపడుతున్న ప్రతి జనసేన కార్యకర్తకు పవన్ కళ్యాణ్ దగ్గర గుర్తింపు ఉంటుందన్నారు. కాగా ఈ సందర్భంగా అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసిన జనసేన నాయకులను జిల్లా అధ్యక్షులు బాబు చేతుల మీదుగా సన్మానించి అభినందించే కార్యక్రమం చేపట్టారు. అనంతరం వాలంటీర్లు అందరికీ పార్టీ కేంద్ర కార్యాలయం పంపించిన కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పెద్దాపురం పట్టణ అధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు, కటారి శ్రీను, తమనార లక్ష్మణ్ దివాకర్, కోప్పిరెడ్డి నాగబాబు, కౌన్సిలర్ ఒబిలిశెట్టి గున్ని, వంగలపూడి సతీష్, మలిరెడ్డి బుచ్చిరాజు, పబ్బినిడి ఈశ్వరావు, జనసేన నాయకులు, క్రియాశీలక వాలంటీర్లు పాల్గొన్నారు.

# ‘శుభం’.. నష్టాలు లేకుండా సామ్ సేఫ్ బిజినెస్!



సమంత రూత్ ప్రభు నిర్మాతగా కొన్నేళ్ల క్రితం యూటర్న్ అనే సినిమా చేసింది. కానీ ఆ సినిమా సరిగ్గా ఆడక పోవడంతో మళ్ళీ నిర్మాతగా ఎక్కడ పెట్టుబడులు పెట్టలేదు. ఇక ఇప్పుడు మళ్లీ రీ ఎంట్రీతో చేసిన చిత్రం ‘శుభం’తో టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. మే 9న వరల్డ్‌వైడ్ రిలీజ్ కానున్న ఈ ఫ్యామిలీ కామెడీ థ్రిల్లర్, రిలీజ్‌కు ముందే మంచి బిజినెస్‌తో దూసుకెళ్తోంది. ప్రవీణ్ కాండ్రే గుల డైరెక్షన్‌లో, సమంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌లో రూపొందిన ఈ సినిమా, ట్రైలర్‌తోనే సోషల్ మీడియాలో టాప్ ట్రెండింగ్‌లో నిలిచింది. సమంత ఈ సినిమాలో మతాజీ పాత్రలో నటిస్తూ, నిర్మాతగా తన సత్తా చాటుతోంది. అలాగే రెగ్యులర్ ప్రమోషన్‌లో పాల్గొంటూ సినిమాకు పాజిటివ్ హైప్ క్రియేట్ చేస్తోంది. ఇక సినిమా నాన్ థియేట్రికల్ రైట్స్ దాదాపు క్లోజ్ అయినట్లు సమాచారం. జీ గ్రూప్ ఈ సినిమా శాటిలైట్ హక్కులను దక్కించుకుంది. అటు నెట్ ఫ్లిక్స్ సంస్థతో ఓటీటీ డీల్స్ కూడా ఓ కొలిక్కి వచ్చాయని తెలుస్తోంది. ఈ రెండు డీల్స్‌తోనే ‘శుభం’ టేబుల్ ప్రాఫిట్ సొంతం చేసుకున్నట్లు టాక్. ఈ డీల్స్ వివరాలు అధికారి కంగా వెల్లడి కానప్పటికీ, సినిమా బడ్జెట్‌ను ఈ రైట్స్ ద్వారానే రికవర్ చేసుకునే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ లెక్కన ‘శుభం’ సినిమా సమంతకు నిర్మాతగా తొలి సక్సెస్‌ను అందించినట్లే. ఈ సినిమా కథ 2004లో భీమునిపట్నం నేపథ్యంలో సాగుతుంది. ముగ్గురు స్నేహితుల జీవితాల్లో, వారి భార్యలు టీవీ సీరియల్‌కు అడిక్ట్ అవడం, ఆ తర్వాత వారు పొసెస్డ్ అయినట్లు ప్రవర్తించడం ఈ సినిమా కథాంశం. ఈ సమస్య నుంచి బయట పడేందుకు వారు సమంత పోషించిన మతాజీ సాయం తీసుకుంటారు. ఈ కామెడీ థ్రిల్లర్ సమ్మర్ సీజన్‌కు పర్ఫెక్ట్ ఎంటర్‌టైనర్‌గా నిలుస్తుందని టాక్. ఈ రోజు హైదరాబాద్‌లో మూడు థియేటర్లలో ‘శుభం’ పెయిడ్ ప్రీమియర్ షోలు కొనసాగుతున్నాయి.

మొదటి షోలు హౌస్‌ఫుల్‌తో దూసుకెళ్లాయి. ఈ రెస్పాన్స్ చూస్తుంటే మరిన్ని థియేటర్లలో ప్రీమియర్ షోలు ఓపెన్ అయ్యే అవకాశం ఉంది. ఈ షోలకు వచ్చిన ఆడియన్స్ నుంచి సినిమాకు పాజిటివ్ టాక్ వస్తోంది, ఇది రిలీజ్ డే బుకింగ్స్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. సినిమాలో హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి, శ్రీయ కొంతం, శ్రావణి లక్ష్మి, శాలిని కొండే పూడి, వంశీధర్ గౌడ్ నటిస్తున్నారు. షోర్ పోలీస్ సంగీతం, వివేక్ సాగర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు బలంగా నిలు స్తున్నాయి. సమంత తన నిర్మాణ సంస్థ ద్వారా వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ, నిర్మాతగా సక్సెస్‌ఫుల్ జర్నీ మొదలు పెట్టింది. మొత్తంగా, ‘శుభం’ సినిమా నాన్-థియేట్రికల్ డీల్స్‌తో టేబుల్ ప్రాఫిట్ సాధించడంతో సమంత నిర్మాతగా తొలి అడుగు సక్సెస్ అయినట్లే.

# హిట్ 3 బాక్సాఫీస్.. అనుకున్నట్లే టార్గెట్ ఫినిష్ చేసిన అర్జున్ సర్కార్!



ఇటీవల టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద వరుస ఫ్లాప్‌లు చూసింది. అయితే నాని నటించిన ‘హిట్ 3: ది థర్డ్ కేస్’ సినిమా ఇండస్ట్రీకి ఊపిరి పోసింది. శైలేష్ కొలను డైరెక్షన్‌లో వచ్చిన ఈ క్రైమ్ థ్రిల్లర్, మే 1 రిలీజై, ఆరు రోజుల్లోనే అన్ని ఏరియాల్లో బ్రేక్ ఈవెన్ సాధించి టాలీవుడ్‌కు కొత్త జోష్ తెచ్చింది. ఈ సినిమా వరల్డ్‌వైడ్ రూ.100 కోట్ల మార్క్‌ను దాటడం టాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. ఇటీవలి కాలంలో సినిమాలు ఆడియన్స్‌ను థియేటర్లకు రప్పించడంలో విఫలమవుతున్న సమయంలో, ‘హిట్ 3’ సక్సెస్ ఇండస్ట్రీకి ఊరటనిచ్చింది. సినిమా ‘A’ సెన్సార్‌తో రావడం, ఫ్యామిలీ ఆడియన్స్, చిన్న పిల్లలు దూరంగా ఉండాలని ముందే చెప్పడం రిస్క్‌గా భావించినా, ‘హిట్ 3’ అద్భుతమైన కలెక్షన్స్ సాధించింది. యూత్, మాస్ ఆడియన్స్‌ను ఎక్కువగా ఆకర్షించడంతో సినిమా బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్లింది. నాని ఇంటెన్స్ ఐపీఎస్ రోల్, హాలీవుడ్ స్టైల్ యాక్షన్ సీన్స్, సస్పెన్స్ ఎలిమెంట్స్ కూడా యూత్‌ను థియేటర్లకు రప్పించాయి. ఈ రిస్క్ తీసుకున్నా సినిమా సక్సెస్ నాని స్టార్‌డమ్‌ను మరోసారి నిరూపించింది. సినిమా తొలి వీకెండ్‌ను పక్కాగా ఉపయోగించుకుంది. దాదాపు అన్ని ఏరియాల్లో మంచి కలెక్షన్స్ సాధించి డిస్ట్రిబ్యూటర్స్‌ను సంతోషపరిచింది. నైజాం, ఉత్తరాంధ్ర, ఓవర్సీస్ మార్కెట్స్‌లో సినిమా ఇప్పటికే లాభాల జోన్‌లోకి చేరింది. హైదరాబాద్‌లో హౌస్‌ఫుల్ షోలతో దూసుకెళ్లిన ఈ సినిమా, ఆంధ్రప్రదేశ్‌లో కూడా బుకింగ్స్ జోరుగా సాగాయి. డిస్ట్రిబ్యూటర్స్ ఈ సినిమా విజయంతో ఫుల్ హ్యాపీగా ఉన్నట్లు సమాచారం. ఇక ‘హిట్ 3’ ఇండియాలోనే కాదు, అమెరికాలో కూడా భారీ కలెక్షన్స్ అందుకుంటోంది. నార్త్ అమెరికాలో ఈ సినిమా $2 మిలియన్ (రూ.16.8 కోట్లు) మార్క్‌ను దాటింది. ఈ రేంజ్‌లో వసూళ్లు సాధించడం నాని కెరీర్‌లో మూడోసారి, అది కూడా వరుసగా మూడో హిట్‌గా నిలిచింది. అమెరికాలో బ్రేక్ ఈవెన్ టార్గెట్ పెద్దగానే ఉన్నా, సినిమా ఆ మార్క్‌ను సులువుగా దాటేసింది. ఎన్ఆర్ఐ ఆడియన్స్‌ను ఆకర్షించడంలో నాని సత్తా మరోసారి రుజువైంది. ఆరు రోజుల్లో అన్ని ఏరియాల్లో బ్రేక్ ఈవెన్ సాధించిన ‘హిట్ 3’, టోటల్‌గా రూ.100 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టింది. ఈ సినిమా నైజం ఏరియాలో ఇప్పటికి మంచి ఆక్యుపెన్సీ సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లో టికెట్ ధరలు పెరిగినప్పటికీ, యూత్, మాస్ ఆడియన్స్ సపోర్ట్‌తో సినిమా దూసుకెళ్లింది. ఈ సినిమా ఓవర్సీస్‌లో కూడా లాభాల జోన్‌లోకి చేరడం నాని స్టార్‌డమ్‌ను చాటుతోంది. 2025లో సాలిడ్ హిట్‌లలో ‘హిట్ 3’ ఒకటిగా నిలిచింది. వీకెండ్ తర్వాత కూడా సినిమా మంచి ఆక్యుపెన్సీతో కొనసాగుతోందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.

# డైరెక్టర్ కొడుకుతో వెంకీ ఫ్రెండ్‌షిప్



హిట్‌వర్స్ సినిమాతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు శైలేష్ కొలను. మధ్యలో శైలేష్, విక్టరీ వెంకటేష్ హీరోగా సైంధవ్ అనే సినిమా కూడా తీశాడు. గతేడాది సంక్రాంతికి రిలీజైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద తీవ్రంగా నిరాశపరిచిన విషయం తెలిసిందే. ఇంకా చెప్పాలంటే సైంధవ్ సినిమా దారుణమైన ఫ్లాప్ గానే మిగిలింది. రీసెంట్‌గా హిట్3తో సక్సెస్ అందుకున్న శైలేష్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ వెంకటేష్ తో తన అనుబంధాన్ని, రిలేషన్‌షిప్‌ను షేర్ చేసుకున్నాడు. తమ కలయికలో వచ్చిన సైంధవ్ సినిమా అనుకున్న అంచనాలను అందుకోలేకపోయిందని, ఎప్పటికైనా వెంకీ గారితో మళ్లీ సినిమా తీసి మంచి హిట్ ను ఇస్తానని చెప్పాడు శైలేష్.

సైంధవ్ రిలీజయ్యాక రెండు వారాల పాటూ రోజూ ఉదయాన్నే 9 గంటలకు వెంకీ సర్ నుంచి ఫోన్ వచ్చేదని, రిజల్ట్ ను పట్టించుకోకు. డల్‌గా ఉండకు, లేచి ఆఫీస్‌కు వెళ్లు, వెళ్లి రోజూ 20 పేజీలు ఏదొకటి రాసుకో అంటూ మోటివేట్ చేసేవారని, తన ఆఫీస్‌కు పిలిచి చాలాసేపు మాట్లాడేవారని, సినిమాలు, వాటి రిజల్ట్ తమ బాండింగ్‌ను ఏ విధంగా ప్రభావితం చేయలేదని, ఆ టైమ్‌లో ఆయన ఇచ్చిన సపోర్ట్ ఎప్పటికీ మర్చిపోలేనని, ఆయనతో తీసిన సైంధవ్ ఫ్లాప్ అయినప్పటికీ ఆ సినిమా తర్వాత వెంకీ సర్ ఫ్యామిలీ మెంబర్ అయిపోయారని చెప్పాడు శైలేష్. వెంకీకి తన కొడుకు రోజూ ఐదారు వీడియోలు పంపిస్తాడని, దానికి ఆయన కూడా రిప్లై ఇస్తుంటారని, వారిద్దరి మధ్య మంచి బాండింగ్ ఉందని, రీసెంట్‌గా చెట్లు కొట్టే విషయంలో వెంకీ గారికి ఫోన్ చేసి, వెంకీమామ చెట్లు కొట్టేస్తున్నారు, ఏదొకటి చెయ్ మామ అంటూ కంప్లైంట్ చేశాడని, వారిద్దరి మధ్య ఓ రకమైన ఫ్రెండ్ షిప్ ఉందని కూడా శైలేష్ ఈ సందర్భంగా వెల్లడించాడు. ఆల్రెడీ తామిద్దరం కలిసి ఓ సినిమా చేయాలని మాట్లాడుకున్నామని, కచ్ఛితంగా ఇద్దరం కలిసి సాలిడ్ కంబ్యాక్ ఇస్తామని, తమ బ్యూటిఫుల్ రిలేషన్ ఆ సినిమాను మరింత మెరుగ్గా చేస్తుందని చెప్పిన శైలేష్, ఆయనకు మంచి హిట్ ఇస్తే అదే ఆయనకు తాను చేసే మంచి అవుతుందని, దానిపై తాను వర్క్ చేయనున్నట్టు శైలేష్ చెప్పాడు.

# జెట్ స్పీడ్‌లోనే రవితేజ న్యూ కాంబో!



మాస్ మహారాజ్ రవితేజ ఎప్పుడూ కూడా వైవిధ్యమైన కథలతో అభిమానులను అలరించేందుకు ప్రయత్నిస్తాడు. ‘క్రాక్’, ‘ధమాకా’ సినిమాలతో సూపర్ హిట్స్ అందుకున్న రవితేజ, తన స్టైల్‌లో మాస్, యాక్షన్ ఎంటర్‌టైనర్స్‌తో బాక్సాఫీస్ షేక్ చేశాడు. కానీ, ఈ మధ్య కొన్ని సినిమాలు అతని ఇమేజ్‌కు తగ్గట్టుగా లేకపోవడంతో డిజాస్టర్స్‌గా మిగిలాయి. ‘రావనసుర’, ‘టైగర్ నాగేశ్వరరావు’, ‘ఈగల్’, ‘మిస్టర్ బచ్చన్’ సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. ఈ నేపథ్యంలో రవితేజ తన కొత్త సినిమాలతో మళ్లీ ఫామ్‌లోకి రావాలని చూస్తున్నాడు. ప్రస్తుతం రవితేజ ‘మాస్ జాతర’ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ సినిమా రవితేజ ఇమేజ్‌కు తగ్గట్టుగా మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ సినిమా ఈ ఏడాది చివర్లో రిలీజ్ కానుంది. ఈ సినిమాతో రవితేజ మళ్లీ బాక్సాఫీస్ వద్ద సందడి చేయాలని అభిమానులు ఆశిస్తున్నారు. మాస్ జాతర సినిమా తర్వాత రవితేజ కొత్త ప్రాజెక్ట్‌తో అభిమానులను అలరించడానికి సిద్ధమవుతున్నాడు. లేటెస్ట్ అప్డేట్ ప్రకారం, రవితేజ కిషోర్ తిరుమలతో ఓ కొత్త సినిమా స్టార్ట్ చేయబోతున్నాడు. ఈ సినిమా షూటింగ్ జూన్ 3, 2025 నుంచి మొదలవుతుందని టాక్. ఈ ప్రాజెక్టుని కూడా మాస్ రాజా జెట్ స్పెస్‌లోనే ఫినిష్ చేసి వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రిలీజ్ చేయాలని చూస్తున్నారట. ఇక ‘చిత్రలహరి’, ‘రెడ్’ సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న కిషోర్ తిరుమల, ఈ సినిమాలో రవితేజతో ఓ ఫుల్ ఎంటర్‌టైనర్‌ను తీసుకొస్తున్నాడు. ఈ సినిమాకు కూడా భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు. ఈ కాంబో అభిమానులకు మంచి ట్రీట్ ఇవ్వనుందని అంటున్నారు. సినిమా కథ వివరాలు ఇంకా బయటకు రాలేదు, కానీ ఇది రవితేజ స్టైల్‌లో మాస్, కామెడీ, యాక్షన్ ఎలిమెంట్స్‌తో నిండి ఉంటుందని టాక్. ఈ సినిమా కోసం రవితేజ ఓ కొత్త లుక్‌లో కనిపించనున్నాడని, కిషోర్ తిరుమల అతని ఎనర్జీని సరైన విధంగా వాడుకునేలా స్క్రిప్ట్ రెడీ చేశాడని సమాచారం. ఈ సినిమా రవితేజ ఇమేజ్‌ను మళ్లీ బూస్ట్ చేసే అవకాశం ఉందని అభిమానులు ఆశిస్తున్నారు. మొత్తంగా, రవితేజ గత డిజాస్టర్స్ నుంచి బౌన్స్ బ్యాక్ అవ్వాలని చూస్తున్నాడు.

# కిక్ బాక్సింగ్‌లో రాష్ట్ర స్థాయిలో సెలెక్ట్ అయిన 6 క్రీడాకారులు అభినందించిన గాజువాక ఆర్టీవో వి.జయప్రకాష్





**అగనంపూడి, (రాజధాని వార్తలు):** అగనంపూడి సి డబ్ల్యూ సిలో ఏ వన్ మాస్టర్ లార్డ్స్ అకాడమీ కోచ్ కొమ్మోజి అశోక్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 4 తేదీన ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన కిక్ బాక్సింగ్ రాష్ట్ర స్థాయిలో వివిధ క్యాటగిరిలో ఎంపికైన 6 క్రీడాకారులను అభినందించిన ముఖ్య అతిథి గాజువాక రవాణా శాఖ అధికారి వి.విజయప్రకాష్, అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి యువత దుర వ్యసనాలకి బానిసలు కాకుండా డ్రగ్స్‌కి దూరంగా ఉండి ఇటువంటి క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించి వారి భవిష్యత్తుకి రాష్ట్రానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. రాష్ట్ర స్థాయి నుండి జాతీయ స్థాయికి వెళ్లి కిక్ బాక్సింగ్‌లో విజేతలుగా నిలబడాలని కోరారు. యువతి, యువకులు డ్రైవింగ్ నిర్లక్ష్యంగా చేస్తూ తమ ప్రాణాల్ని పోగొట్టుకుంటున్నారని దానివల్ల వారి కుటుంబం దుఃఖముతో బాధపడుతున్నారని కావున యువత ట్రాఫిక్కు నిబంధనలకు అనుగుణంగా డ్రైవింగ్ చేయాలని పిలుపునిచ్చారు. పాఠశాల పాఠశాల స్థాయి నుండి కాలేజీల వరకు పిల్లలకు యువకులకు క్రీడల్లో ప్రోత్సహించడానికి స్కూలు యాజమాన్యం, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. రాష్ట్ర కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు జి.ఆనంద్ బాలు మాట్లాడుతూ రాయపూర్‌లో జరిగే జాతీయ స్థాయిలో జరిగే కిక్ బాక్సింగ్‌లో ఈ క్రీడాకారులు విజయం సాధించాలని కొమ్మోజి అశోక్ అకాడమీ ప్రారంభించి 6 నెలలోనే 6ని రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేయడం అభినందినీమని అన్నారు. ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ క్రీడలు శరీర ధృడత్వానికి ఎంతో దోహదపడుతుందని విద్యార్థులు కేవలం చదువుకే అంకితం కాకుండా క్రీడల్లో కూడా నైపుణ్యం చెందినట్లయితే ఆరోగ్యంగా చురుగ్గా ఉంటారని అన్నారు. జీవీఎంసీ వారు త్వరగా సమ్మర్ క్యాంపు ప్రకటించాలని కోరారు.

ఏ వన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కోచ్ కొమ్మోజి అశోక్ సభ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకు రాలు జి పావని నాయుడు, తెలుగు మహిళా నాయకురాలు గోపిశెట్టి పద్మ, వైఎస్ఆర్సిపి మహిళా నాయకురాలు కె సుజాత, ఏ డి సి డైరెక్టర్ కొమ్మోజి భీష్మాచారి సీనియర్ క్రీడ కారుడు ఎం.అప్పలనాయుడు మరియు కిక్ బాక్సింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడు : జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్








**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు చిరస్మరణీయుడని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ కొనియాడారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి, అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతికి అల్లూరి చేసిన సేవలను కొనియాడారు. అల్లూరి చేసిన స్వాతంత్ర్య పోరాటం ఎందరో వీరులకు స్ఫూర్తినిచ్చిందని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో విప్లవ జ్యోతి అల్లూరి చరిత్ర ఒక ప్రత్యేక అధ్యాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవి, డిఆర్ఓ వై.సత్యనారాయణ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.ఆర్.ఆర్.సి సుబ్బలక్ష్మి, సిపిఓ బి.రామారావు, డి.ఎల్.డి.ఓ మంజులవాని, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నాగ శిరీష, ఇన్చార్జి ఏవో వాసు నాయుడు, సెక్షన్ సూపరింటెండెంట్స్, కలెక్టరేట్‌లోని వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజనుల ఎదుగుదల రాజకీయ అడ్డంకుల్లో చిక్కుకుపోతుందా?

### - గిరిజన చట్టాలపై కోర్టుల జోక్యం సరైంది కాదు

### - ఆదివాసి గిరిజన సంఘం గౌరవ అధ్యక్షులు చిన్నయ్య పడాల్



**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** గిరిజన ప్రాంతాలలో 26 ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలన్నీ స్థానిక గిరిజనులకే శతశాతం కేటాయించాలని, గిరిజన చట్టాలు హక్కులపై కోర్టుల జోక్యం సరైనది కాదని ఆదివాసి గిరిజన సంఘం గౌరవ అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. బుధవారం అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతిని పురస్కరించుకొని, చింతపల్లి మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద అల్లూరి విగ్రహానికి స్థానిక గిరిజన నాయకులు, గిరిజనులతో కలిసి పూలమాల వేసి గౌరవ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఐదవ షెడ్యూల్ కిందకు వచ్చే ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఉద్యోగం 100% గిరిజనులకే ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. స్థానికంగా ఎమ్మెల్యేలు నుంచి వార్డు సభ్యుల వరకు గిరిజనులే ప్రజాప్రతినిధులై ఉన్నా, ఉద్యోగాలు మాత్రం ఇతరులకు ఎలా ఇవ్వగలుగుతారో అర్థం కావడం లేదన్నారు. ఇంకా గిరిజనులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా పూర్తిగా ఎదగలేదనీ, ప్రభుత్వాలు ఈ విషయంలో నిజాయితీగా ఆలోచించాలన్నారు. ఇప్పుడు కూడా గిరిజనులు రాజకీయ పదవుల్లో ఉన్నా, వారు స్వతంత్రంగా కాకుండా పార్టీ వ్యామోహంలో బానిసలుగా మారుతున్నారని వ్యాఖ్యానించారు. 1/70 భూ చట్టం అమలులో ఘోరంగా విఫలమవుతోందని, ప్రభుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యంగా టూరిజం పేరుతో గిరిజనుల భూమి దోపిడీకి గురవుతోందని, ప్రభుత్వాలు దాన్ని అడ్డుకోవాల్సిన బాధ్యతను నిర్వర్తించడంలేదని తీవ్రంగా విమర్శించారు. 1986లో ఇచ్చిన జీవో 275 ఉద్దేశాన్ని ప్రస్తావిస్తూ, గిరిజన ప్రాంతాల్లో స్థానిక గిరిజనులే ఉపాధ్యాయులుగా నియమితులైతే విద్యలో నిజమైన మార్పు సాధ్యమవుతుందన్నారు. అయితే, దాన్ని రద్దు చేసి జీవో నెం. 3ను తీసుకు రావడం, కోర్టు ఆ జీవోను రద్దు చేసిన తీర్పు వాస్తవికతకు వ్యతిరేకమని అభిప్రాయపడ్డారు. గిరిజన చట్టాలు, హక్కుల అమలులో కోర్టులకు సమీక్షా అధికారం ఉన్నా, వాటిని రద్దు చేసే హక్కు మాత్రం రాష్ట్రపతికి మాత్రమే ఉందని, గవర్నర్ సిఫార్సుతో మాత్రమే గిరిజన హక్కులపై నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. చివరగా, అల్లూరి సీతారామరాజు పోరాటాన్ని గుర్తు చేస్తూ, అల్లూరి చేసిన త్యాగాలను గౌరవించాలంటే, ఈ భూమి, అడవి, నీటి కోసం పోరాడాల్సిన బాధ్యత ప్రతి ఆదివాసి బిడ్డపై ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్, మండల కార్యదర్శి సాగిన చిరంజీవి, కిల్లో సింహాచలం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం మార్కెట్, కొత్త శోభ దిశగా అడుగులు

### - అంధవరపు తవిటయ్య వర్ధంతి వేడుకలో ఎమ్మెల్యే గొండు శంకర్



**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** మార్కెట్ మర్చంట్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ పెద్దమార్కెట్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో అంధవరపు తవిటయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే గొండు. శంకర్, తవిటయ్య కుటుంబ సభ్యులతో విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించి మాట్లాడుతూ ప్రముఖులు, మాజీ శాసన సభ్యులు అంధవరపు తవిటయ్య వర్ధంతి వేడుకలు నా హయాంలో జరగటం ఆనందదాయకమని, అంధవరపు తవిటయ్య కుటుంబంతో మా చిన్ననాటి నుండే సత్సంబంధాలున్నాయని, సేవలకు చిరునామా తవిటయ్య గారని గుర్తు చేశారు. మార్కెట్‌కు కొత్త శోభ తీసుకొస్తామని, వ్యాపారస్తులకు ఎటువంటి ఇబ్బంధి కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కొద్ది రోజుల్లో పనులు జరుగుతాయని అందుకు మనమంతా సిద్ధం కావాలన్నారు. అనంతరం మాజీ మున్సిపల్ చైర్పర్సన్ పైడిశెట్టి జయంతి, అంధవరపు సంతోష్, ప్రసాద్, కార్యక్రమ ముఖ్య కారకులు కోరాడ హరిగోపాల్, కొరడా రమేష్, మాట్లాడుతూ తవిటయ్య విశిష్టత, మార్కెట్ వర్తకుల ఔన్నత్యాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ మర్చంట్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ పెద్ద మార్కెట్ శ్రీకాకుళం సభ్యుల బృందం, అంధవరపు తవిటయ్య కుటుంబ సభ్యులు, స్థానికులు, వ్యాపారస్తులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

# అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్ కుమార్



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి పట్టణంలో గుడ్ షెడ్ ప్రాంతంలో అల్లూరి సీతారామరాజు 101వ గారి వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ అల్లూరి సీతారామరాజు గారి గురించి ఆళ్ళ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల్లో ముఖ్యమైన వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్న మహనీయులు మన్నెం యోధుడు తెలుగు జాతి ముద్దుబిడ్డ బ్రిటీషర్లను గడగడలాడించిన శ్రీ అల్లూరి సీతారామరాజు గారి వర్ధంతి సందర్భంగా పోరాటయోధుడికి ఘన నివాళులు అర్పిస్తూ. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కోరిబిల్లి పరమేష్, కొణతాల అప్పలరాజు, బిజెపి సాయి, గుప్తా రమేష్, నాగమణి, తల్లాడ కిరణ్, విల్లూరి సంతోష్, దాడి భాను అనిల్, మారిశెట్టి భాస్కర్, సంతోష్, ఒడిశెట్టి కనకరాజు, సాయి బాబా, ప్రసాద్, మరియు గుడ్ షెడ్ ప్రాంత వాస్తవ్యులు, అబ్దుల్ కలాం సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేత

### - చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు





**ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్, (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మైలవరం శాసన సభ్యులు వసంత కృష్ణప్రసాదు లబ్ధిదారులకు అందజేశారు. విజయవాడ రూరల్ మండలానికి చెందిన 5 గురు లబ్ధిదారులకు తాజాగా రూ.4,12,353 రూపాయల సి.ఎం.ఆర్.ఎఫ్ ఆర్థిక సాయం మంజూరైంది.

ఈ సాయాన్ని శాసనసభ్యులు కృష్ణప్రసాదు విజయవాడ రూరల్ మండలంలోని శాసనసభ్యుని వారి కార్యాల యంలో బుధవారం లబ్ధిదారులకు చెక్కుల రూపంలో అందజేశారు. సీఎం చంద్రబాబు సందేశ పత్రాలను కూడా వారికి అందజేశారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదా రులు మాట్లాడుతూ శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాదు గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభకు గౌరవం అమరావతిలో లావణ్యకు ప్రతిభ అవార్డు

### - 576 మార్కులతో మెరిసిన లావణ్య - చింతపల్లి మండలానికి గర్వకారణం



**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** చింతపల్లి మండలం లోతుగడ్డ జంక్షన్‌కు చెందిన ఉర్ల అప్పారావు కుమార్తె లావణ్య ప్రతిభను రాష్ట్రం గుర్తించింది. ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షల్లో ఆమె 600లో 576 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభను చాటింది. ఈ కృషిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం లావణ్యను 'ప్రతిభ అవార్డు'తో సత్కరించింది. ఈ సందర్భంగా మంగళవారం అమరావతిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యాశాఖ అధికారుల నుంచి లావణ్య ప్రతిభ అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందుకుంది. ఆమె తపన, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శనం ఈ విజయం వెనుక ఉన్న ముఖ్య కారణాలుగా పేర్కొనబడింది. ఇలాంటి ప్రతిభావంతులు గ్రామీణ ప్రాంతాల నుంచే రావడం ఆనందదాయకమని, మరింత మంది విద్యార్థులకు లావణ్య ప్రేరణ కావాలని స్థానికులు అభిప్రాయ పడ్డారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan